వర్షపుజల్లులలో...

కుప్పిలి పద్మ

కిటికీలోంచి బయటికి చూస్తున్నాను. వర్షం పడేట్టుంది. అమ్మ నా పక్కగా వచ్చి నిలబడి, "పెద్ద వర్షమే వచ్చేట్టుంది," అంది. నేనేం మాట్లాడలేదు. చిన్న సవ్వడితో వర్షం మొదలయింది. పెద్ద చినుకులు పడుతున్నట్టున్నాయి. శబ్దం స్పష్టంగా వినబడుతోంది.

అమ్మ గదిలోంచి బయటికి వెళ్లింది. వర్షం వేగంగా పెద్దదవుతోంది. గాఢమైన కాఫీ పరిమళం. వెనగ్గా అమ్మ ట్రేలో నల్లటి మట్టికప్పుల నిండుగా లేత బ్రౌన్ కలర్ నురగతో. కప్పు అందుకున్నా. అప్పటికి వర్షం పెద్దదయ్యింది. ధారగా కురుస్తోన్న సవ్వడి. కిటికీలోంచి గాలి వీచినప్పుడల్లా సన్ననిజల్లు లోపలికి చిలకరిస్తోంది. జల్లు గాలితో ముఖాన్ని తాకినప్పుడల్లా జల్లుమంటోంది. ఒకప్పుడు అలా తాకినప్పుడు హాయిగా అనిపించేది. గొప్ప అనుభూతి. ఈ ప్రపంచం నుంచి దూరంగా మరొక ప్రపంచంలోకి ఏ ఆలోచనలూ, బాధామయక్షణాలూ లేని స్వప్న ప్రపంచానికి వెళుతున్నట్టుగా ఉండేది.

ఇప్పుడంతా బాధామయ కాలం.

అమ్మ గదిలోని పెద్ద లైట్ ఆర్పివేసింది. చీకట్లోంచి వర్షాన్ని చూడటం అమ్మకి ఇష్టం. చప్పున చీకటి అలుముకుంది. కొన్ని నిమిషాలు వర్షపు శబ్దం తప్పితే ఏమీ వినిపించలేదు. ప్రపంచం సర్వమూ వర్షపు ధ్వనులతో నిండిపోయినట్టుగా ఆకాశంలోంచి ఏవో రాలిపడుతూ సవ్వడులు చేస్తూ వాటితో కలగలిసి మధ్యమధ్యలో అస్పష్టంగా రోడ్డువారగా వర్షపునీరు పారుతోన్న ధ్వని... ఒకప్పుడు అద్భుతంగా అనిపించిన ధ్వని. చీకటికి కళ్లు అలవాటుపడ్డాక కొద్దిక్షణాల క్రితం కనిపించిన దృశ్యం మారిపోయింది. యెదురుగా మసకమసగ్గా వర్షం తెలుస్తోంది. సన్నటి మృదువైన లేతవేళ్లతో ముఖాన్ని చరిచినట్టుగా వుంది. వర్షపుజల్లు ముఖాన విసురుగా తాకుతూ ఉంది. వర్షం అస్పష్టంగా కనిపిస్తూ స్పష్టంగా వినిపిస్తూ ఉంది.

"ఏమైంది మహీ," అమ్మ మెత్తని స్వరం స్పష్టంగా అడిగింది. అమ్మ పెద్దగా ప్రశ్నలు వేయదు, అనివార్యమైతే తప్ప. అటువంటప్పుడు జవాబు చెప్పకుండా తప్పించుకోవటానికి వీలుకాదు. తప్పని సరై కాదు. ఆ ఆత్మీయతని వదులుకోలేక.

అవును ఏమయింది...

ఇంటర్మీడియెట్‌లో జాయిన్ అయిన కొత్తలో ఏమయింది... అంతవరకు రోజూ స్కూల్‌కి స్కూల్ బస్సులో వెళ్లటం, ఇంటికి రావటం. యూనిఫామ్ మార్చుకుని పాలు తాగేసరికి మ్యూజిక్ టీచర్ రావటం, సంగీతం క్లాస్ అయేసరికి ట్యూషన్ టీచర్ రావటం. ట్యూషన్ అవుతుండగా అమ్మ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేది. వంట చేస్తుండగా తమ్ముడు ట్యూషన్ నుంచి వచ్చేవాడు. ఆఫీసు, స్కూలు కబుర్లు, పుస్తకాలలో కథలు, పాటలు, మాట్లాడుకుంటూ భోజనాలు చేయటం. నాన్నగారు తొమ్మిది గంటలకంటే ముందు ఇంటికి రావటం తనెప్పుడూ చూడలేదు. ఇలా పదో తరగతి వరకు సాగింది. ఇంటర్మీడియెట్‌లో జాయినయ్యాక బస్టాండ్‌కి వెళ్లటం, బస్సెక్కటం, ట్యూషన్‌కి ట్యుటోరియల్ కాలేజ్‌కి వెళ్లటం. ఒక ప్రొటెక్టడ్ జీవితం నుంచి బయటికొచ్చిన ఫీలింగ్. నా ముందున్న సమయమంతా డిజైన్ చేసుకునే అవకాశం యేదో దొరికిన భావం. గమ్మత్తుగా అనిపించేది.

అంతవరకు యూనిఫామ్‌లో వెళ్లటంతో రోజూ ఏ బట్టలు వేసుకోవాలనే చాయిస్ వుండేది కాదు. రోజు వో డ్రెస్ వేసుకున్నా పదిరోజులు తిరిగేసరికి వేసు కొంటున్న బట్టలే వేసుకొంటున్నట్టుండేది.

"అంతా రోజుకో డ్రెస్ వేసుకొస్తారు తెలుసా. నేనే ఎప్పుడూ వేసుకొనేవే వేసుకొస్తున్నట్టుంటా," అన్నానా రోజు.

అమ్మ కాసేపు ఏమీ మాట్లాడలేదు.

"ఎన్ని బట్టలుంటే బాగుంటుంది నీకు," అని అడిగింది.

"ఎన్నంటే... చాలా..."

"ఆ చాలా అంటే ఏమిటో నీకు తెలియదు. ఊరికే చింతించకు. రోజుకో కొత్త డ్రెస్ సంవత్సర మంతా వేసుకొనేంత సంపాదన మనకి లేదు. ఉన్నా అన్ని బట్టలు కొనను కూడా. మరీ తడుముకునేంత తక్కువేం లేవు కదా. అడిగావు కదా ఓ రెండు జతలు కొనుక్కుందువు," అంది.

కాలేజీకి వచ్చేవాళ్లలో నాలా బస్సులో వచ్చే వాళ్లు చాలా తక్కువమంది. టూ వీలర్స్ మీదో, కారు ల్లోనో వచ్చేవాళ్లు యెక్కువ. రోజూ బస్సెక్కి అంత దూరం వెళ్లటం, బస్సు దిగి ఐదు నిమిషాలు నడవాలి కాలేజీకి. బండుంటే...

"వెహికిల్ కొనవా," అడిగానో రోజు.

"ఎందుకు?" అమ్మ అడిగింది.

"ఆ... రోజూ ఆ బస్సులో ఎవరు వెళతారూ..."

"కొందాం," అన్నారు నాన్నగారు.

"ఇప్పుడంత డబ్బెక్కడుంది," అడిగింది అమ్మ.

"పిలిచి లోన్స్ ఇస్తొంటే."

"నెలనెలా కట్టొద్దూ."

"కడదాం."

"ఇప్పుడంత అవసరమా."

"నాకు కంప్యూటర్ కావాలి," అడిగాడు ప్రమోద్.

"ఎనిమిదో క్లాసుకే నీకెందుకురా," అంది అమ్మ.

"ఆ... మా ఫ్రెండ్స్ అందరికీ వున్నాయి. ఎనిమి దంటున్నావ్... నర్సరీ వాళ్లకి కూడా కంప్యూటర్స్ వుంటు న్నాయి. నాక్కావాలి," పేచీ పెట్టాడు ప్రమోద్.

"నీక్కావాలంటే తర్వాత అడుగు. నేనేదైనా అడిగి నప్పుడే అడగాలా," ఈ కంప్యూటర్ పేచీతో వెహికిల్ కొనటం వాయిదా వేస్తారేమోననే భయంతో చప్పున అన్నాను.

"నువ్వే తర్వాత అడుగు. ముందే చెబుతున్నా నా కంప్యూటర్ ముట్టుకోకూడదు," అన్నాడు ప్రమోద్.

"ఆఁ ఎందుకు ముట్టుకోకూడదు. అయితే నాక్కూడా వేరేది కొనండి. ఆ సైబర్‌కేఫ్‌కి వెళ్లి మెయిల్స్ చూసుకోవాల్సి వస్తోంది," అన్నాను.

"వో నీకు నెట్ కూడా కావాలా? అప్పుడు చాలా అవుతుంది," అన్నాడు ప్రమోద్.

"కంప్యూటర్ అక్కకీ ఇవ్వాలి. నీవొక్కడికే అంటే ఎలా," అన్నాడు నాన్న.

"ఇప్పుడు కంప్యూటర్ ఎందుకండీ... ఆ టి.వి., వీడియో గేమ్స్‌తోనే వీడికి లోకం. చదువు మీదే దృష్టి ఉండదు. ఇప్పుడా కంప్యూటర్ తీసుకొస్తే ఇంక పుస్తకం ముట్టుకొనే ముట్టుకోడు," అమ్మ విసుక్కుంది.

వారంరోజుల్లో నాకో టూ వీలర్, తమ్ముడికో కంప్యూటర్ ఇంటికి వచ్చాయి.

నాన్నగారు నన్ను, వెహికిల్‌ని ఆంజనేయస్వామి గుడికి తీసుకెళ్లి వాహనపూజ చేయించారు. ఇంటి కొచ్చాక అమ్మని బండి వెనుక కూర్చోబెట్టుకుని కాలనీ లో తిప్పి తీసుకొచ్చా. తరువాత రోజు అమ్మ హెల్మెట్ కొనిచ్చింది.

"వద్దమ్మా, నవ్వుతారు."

"నో... పెట్టుకోవాల్సిందే," స్పష్టంగా చెప్పింది.

తమ్ముడికీ నాకూ కంప్యూటర్ దగ్గర పేచీ వస్తూనే ఉంది. రోజూ ఒక్కసారన్నా నా బండిపై తిరిగొస్తానని తాళాల కోసం గొడవ చేస్తూనే ఉంటాడు. ఇస్తే ఓ గంట మాయమైపోయేవాడు. బండి కొనుక్కున్నందుకు ఫ్రెండ్స్ పార్టీ అడిగారు. మా కాలేజ్ దగ్గరున్న బేకరీలో అందరికీ పేస్ట్రీస్, పఫ్స్, కోక్ ఇప్పిస్తానని చెప్పాను. అమ్మకి చెబితే డబ్బులు ఇచ్చింది. ఫస్టియర్ చూస్తుండ గానే అయిపోయింది.

సీడీస్, వీసీడీస్, డీవీడీస్ అంతం లేకుండా కబుర్లు సాగుతూనే వుంటాయి. చాలామంది చేతుల్లో సెల్‌ఫోన్స్. పార్టీలు, షాపింగ్, బ్యూటీపార్లర్స్. ఇంత సమయాన్ని ఇలా గడిపినా అందరికీ మార్కులు బాగొ స్తున్నాయి. వొక్కొక్కరి దగ్గర భవిష్యత్‌కి కావల్సినన్ని ప్లాన్స్ వున్నాయి.

"మమ్మీ వీసీడి ప్లేయర్ కావాలి," ప్రమోద్ గొడవ మొదలుపెట్టాడు.

"మొన్నే కదా కంప్యూటర్ కొంది," అంది అమ్మ.

"ఆ... బోర్ పాతదైపోయింది. నాక్కావాలి."

"ఇప్పుడెందుకురా."

"ఎందుకేంటీ సినిమాలు చూడొద్దా..."

"ఈ రెండేళ్లూ కష్టపడి చదవరా. మార్కులు రాక పోతే మంచి కాలేజీలో సీటు రాదు," అమ్మ అంటుంది.

"వూ... కావాలి."

''వీసీడి ప్లేయర్ ఉంటే బాగుంటుంది. మా క్లాస్‌లో అందరిళ్లల్లోనూ ఉంది తెలుసా. వాళ్లంతా వీసీడీస్ గురించి మాట్లాడుకుంటుంటేనే వింటూ కూర్చోవాలి. చూస్తే అప్పుడు నేనూ మాట్లాడొచ్చు,'' అన్నాను.

అమ్మ నావైపు ఓ క్షణం చూసి, ''నువ్వూ, నువ్వు చదువుతున్న కథల పుస్తకాల గురించి, మ్యూజిక్ గురించి మాట్లాడు,'' అంది.

''అవి ఎవ్వరూ మాట్లాడరు. బోర్ అంటారు,'' అన్నాను.

''అవి మాట్లాడకే అక్కా, నువ్వో బోర్‌బర్గర్ అనుకుంటారు,'' అన్నాడు ప్రమోద్.

''కొనుక్కుందాం.'' అన్నాను.

''ఇప్పుడన్ని డబ్బులు ఎక్కడున్నాయి. మనకి మ్యూజిక్ సిస్టమ్ ఉంది కదా. దాన్నేం చేయాలి,'' అంది అమ్మ.

''ఎవరో ఒకరికి అమ్మేస్తే,'' అన్నాను.

''ఇన్‌స్టాల్‌మెంట్‌లో ఇస్తారు మమ్మీ,'' అన్నాడు ప్రమోద్.

''ఇప్పటికే వెహికిల్‌కి, కంప్యూటర్‌కీ కట్టలేక పోతోంటే,'' అంది అమ్మ.

''నాన్నగారిని అడుగుతానుండు,'' అని తమ్ముడు అంటుండగా నాన్నగారు వచ్చారు.

ఆయన చేతిలో కొత్త సెల్!

''వో... సెల్'' అంటూ నేనూ, తమ్ముడూ సరదా పడుతోంటే అమ్మ విస్తుపోతూ

''సెల్ ఎందుకు ప్రకాష్,'' అంది.

''ఆ ఇవాళా రేపు అందరి దగ్గరా ఉంటున్నాయి. ఎవరు చూసినా ఏంటీ సెల్ లేదా అంటున్నారు. తీసుకున్నా,'' అన్నారు నాన్నగారు.

''మనింట్లో ఫోన్ ఉంది. మనిద్దరికి ఆఫీసుల్లో ఫోన్స్ ఉన్నాయి. ఈ చివర్నుంచి ఆ చివరికి పనిపై తిరిగే ఉద్యోగాలు కావు. ఏం అవసరం... అవసరం లేని వస్తువులు ఎందుకు?'' అంది అమ్మ.

''ఈరోజుల్లో సెల్ నెస్ససరీ,'' అన్నారు నాన్నగారు.

అమ్మ నాన్నగారివైపు ఒక చూపు చూసి, ''ఇంకా మన నెస్ససరీస్‌లో ఏమేమి చేరబోతున్నాయో... జీతమంతా ఇలా ఇన్‌స్టాల్‌మెంట్స్‌కే పోతుంటే ఎలా,'' అంది.

''డాడీ... వీసీడీ'' ప్రమోద్ గొడవ మొదలు పెట్టాడు.

''కొందాం... కొందాం.''

''అరే ప్రకాష్ అసలు ఏం ఆలోచించకుండా కొనేద్దాం అంటావేంటి? నువ్వు వూ అంటే చాలు ఇంక రేపట్నుంచి కొనిచ్చేవరకు వాడి మనస్సు అస్సలు పుస్తకం మీద నిలవదు,'' అంది అమ్మ.

''పోనీలేబ్బా సరదా పడుతున్నాడు,'' అన్నాడు నాన్న.

''ఇలా సరదా సరదా అనుకుంటుంటే రేప్పొద్దున అవి తీర్చలేని రోజొకటి వస్తుంది. అప్పుడొదులుతుంది మన సరదా.''

''అరే కాంతీ! అప్పు ఇచ్చినవాళ్లే దాన్ని తీర్చే దారి ఏదో ఒకటి చూపిస్తారు కదా. నువ్వెందుకిలా హైరానా పడతావ్. అసలు నువ్వు కూడా వో సెల్ తీసుకుంటే ఎంతగా మనం ఎస్.ఎమ్.ఎస్.లు ఇచ్చుకోవచ్చు. వో.కె... వోకె... కూల్‌డవున్. నడవండి డిన్నర్‌కి వెళదాం,'' అన్నారు నాన్నగారు.

''ఇప్పుడా వంట అయిపోతే,'' అంది అమ్మ.

''రేపు పోపన్నం చేసెయ్... రండి రండి పోదాం,'' అన్నారు నాన్న.

వేగంగా గాలితో జల్లు ముఖంపైకొచ్చి కొడుతోంటే ఆలోచనల నుంచి బయటికి వచ్చాను.

అమ్మ అడిగిందానికి నేనింకా జవాబు చెప్పనే లేదు. ఇలాంటి వో వర్షకాలపు మధ్యాహ్నం వెహికిల్ డ్రైవ్ చేయటం అసాధ్యమనిపించి కాలేజ్ ఆవరణ దగ్గరున్న బస్టాప్‌లో నిల్చున్నా.

అప్పుడొచ్చాడు ప్రదీప్, మెటాలిక్ సిల్వర్ రంగున్న కారులో.

''హాయ్... కమ్... డ్రాప్ చేస్తా,'' అన్నాడు.

''వెహికిల్ వుంది,'' అన్నాను.

''వో.కె పార్క్ చేశావ్‌గా. వర్షం తగ్గాక ఇక్కడ వదిలేస్తా. ఇక్కడెందుకు తడవటం,'' అన్నాడు.

ప్రదీప్‌ని నాలుగైదుసార్లు చూశా. మా క్లాస్‌మేట్ దీపాలీ కజిన్. తన కోసం వస్తుంటాడు. చిన్ని పరిచయం. కారు నీళ్లు నిండిన రోడ్డు మీద నుంచి సాగుతోంది. టేప్ రికార్డ్‌లోంచి రిక్కీ మార్టిన్ గొంతు.

''మహీ... స్వీట్ నేమ్,'' అన్నాడు.

''వో... థాంక్యూ,'' చప్పున చెప్పాను.

''వర్షంలో అలా ఉంటే తడిసిపోవా.''

''వూహుఁ... వర్షంలో తడిస్తే బాగుంటుంది.''

''వో... వర్షం ఇష్టం. సో రెయిన్‌డాన్స్ ఇష్టం.''

''రెయిన్‌డాన్స్‌కి నేనెప్పుడూ వెళ్లలేదు.''

''వెళ్లలేదా...''

''వూహుఁ''

''డిస్కో?''

''వుహూఁ''

''పబ్''

''వూహూఁ''

''ఎప్పుడూ వెళ్లలేదా... వొక్కసారి కూడా'' ఆశ్చ ర్యంగా అడిగాడు ప్రదీప్.

''లేదు.''

''వో బాయ్‌ఫ్రెండ్స్...''

''లేర్లేరు,'' కంగారుగా చెప్పాను.

''ఇంత అందమైన మహీకి ఇప్పటివరకూ ఎవ్వరూ ప్రపోజ్ చేయలేదా?'' ఆశ్చర్యంగా కళ్లు పెద్దవిచేసి అడిగాడు.

''లేదు''

''సాయంకాలం రెయిన్‌డాన్స్‌కి వస్తావా,'' అడిగాడు.

''రాను... రాను...''

''ఏం డాన్స్ రాదా?''

''నాకు అలాంటిది తెలియదు.''

''వో... కమాన్ చాలా బాగుంటుంది. చాలా ఎంజాయ్ చేస్తావ్,'' అన్నాడు ప్రదీప్.

కారు వో పోర్టికోలో ఆగింది.

''కమాన్,'' అంటూ తను కారు దిగి కీస్ తెల్లని యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తికి ఇచ్చాడు.

అదేంటో తెలియదు. ఏంటని అడిగితే ఏమను కుంటాడో, అతని వెనుక లోపలికి అడుగుపెట్టాను.

వో యింటిని పబ్‌గా మార్చారు.

ఆ లోపల లోవెలుగు సువాసన. మెత్తని పాల రాయి నేల. హుషారైన సంగీతం చిన్నిస్థాయిలో. అక్క డక్కడా అమ్మాయిలు అబ్బాయిలు చేరి విస్కీ తాగుతూ సిగరెట్స్ కాలుస్తూ.

పూర్తి వెస్ట్రన్ ఫిట్టింగ్స్‌లో.

నా బట్టలవైపు చూసుకున్నాను. షల్వార్ కమీజ్ కాటన్‌వి. కనీసం షార్ట్ కుర్తా ఐనా కాదు. పొడవైన జడ. వీళ్లంతా నేనో స్టేయిల్ బర్గర్ అనుకుంటారు. అప్పు డప్పుడు జీన్స్ వేసుకుంటా. కనీసం ఈరోజు ఆ జీన్స్, ఆ లూజ్ టీ షర్ట్ అయినా వేసుకోలేదు. స్కిన్ టైట్ టాప్స్ లేనేలేవ్.

సిగరెట్ వెలిగిస్తూ ''ఏం తీసుకుంటావ్'' అడి గాడు ప్రదీప్.

కాఫీ అంటే బాగోదేమో... కోక్... గుడ్ నన్ను నేనే అభినందించుకొంటూ, ''కోక్,'' అన్నాను.

''కోక్ విత్...''

విత్... స్నేక్స్ చెప్పాలా అనుకొంటుంటే అతనే అన్నాడు

''యీ వర్షంలో బీర్ తాగితే భలేగుంటుంది.''

''విత్ అంటే ఇలాంటిది చెప్పాలా... బీర్... బాప్ రే... కాదంటే బాగుండదేమో... ఏం అనుకుంటాడో... యీ అలవాటు లేని పనిచేస్తే ఏం అభాసుపాలవు తానో... అంతా యింతగా నవ్వుతూ తుళ్లుతూ చాలా మామూలుగా తాగుతున్నారు కదా. యిందులో వున్న కిక్ ఏమిటో. వొక్కసారి రుచి చూస్తే. తాగ్గానే వాంతొస్తే బాగుండదేమో. తాగాక బయటకి నడవలేకపోతే అంతా చెత్తచెత్తగా తయారవుతుందేమో పరువు పోతుందేమో... ముందే యీ బట్టలు, జడ పురాతనంగా వున్నాయి... ఏం చెపుదాం... తాగాక బస్టాప్‌లో వదులుతాడు. ఆ బండి మీద వెళుతూ కింద పడితే... ఎలాగోలా ఇంటి వరకూ వెళ్లినా ఇంట్లో తెలిసిపోతే... ఆ! అమ్మ రాక ముందే వెళుతుంది కదా శుభ్రంగా బ్రష్ చేసుకొని ఏలక్కాయ నోట్లో వేసేసుకుంటే సరి. ఛ... ఎందుకింత గొడవ... అంతా హాయిగా కాఫీ తాగినదానికంటే సునా యాసంగా తాగుతోంటే. పబ్సునిండా యీ అమ్మాయిలు, అబ్బాయిలవి ఫోటోస్ వేసి రాస్తుంటే వొక్కసారి టేస్ట్ చూస్తే ఏమవుతుంది. వొక్కసారే కదా... అనుకోకుండా వచ్చిన అవకాశం.

''బీర్ ఆర్డర్ చేస్తున్నా,'' అన్నాడు.

''వూ,'' కళ్లతో చెప్పాను.

బీర్ కొన్ని స్నేక్స్ వచ్చాయి.

అతని సెల్‌కి కాల్స్ వస్తూనే ఉన్నాయి.

''సెల్ వాడవా'' అడిగాడు.

'వాడవా... అదేదో వాడే తాహతుండి వాడటం యిష్టంలేక వాడనట్టు'... నవ్వొచ్చింది.

''ఛీర్స్,'' అన్నాడు గ్లాసు కొసలు తాకిస్తూ.

సిప్ చేస్తున్న అతనివైపే కళ్లార్పకుండా చూసా. అతని ముఖంలో ఎక్కడా ఆ రుచిని పట్టుకోగలిగే భావా లేం కనిపించలేదు. అతనికి అలవాటు కదా.

మెల్లగా గ్లాసు పెదవుల దగ్గరికి తీసుకొచ్చాను. వొక్క సిప్... జివ్వుమన్న నాలిక... వగరుగా... నా వల్ల కాదు... ఆ చల్లదనం గొంతులోకి జారుతోంటే ఈ రుచి తెలియకుండా చప్పున జీడిపప్పు నోట్లోకి సుతారంగా వేసుకున్నా.

వదిలేస్తే బాగోదు. ఎలాగోలా పూర్తి చేసేస్తే ఇంకె ప్పుడూ తాగకూడదు. రెండో సిప్... ఈసారి వెంటనే జీడిపప్పు నోట్లో వేసుకోవాలనిపించలేదు. మెల్లమెల్లగా ఆ రుచి అలవాటైపోయింది.

ప్రదీప్ తను వెళ్లే డిస్కోలు, పార్టీలు, సెల్‌ఫోన్స్, సినిమాలు మాట్లాడుతున్నాడు. అతను చదువు విషయం ఏం మాట్లాడటంలేదు. అతనితో ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా వింటున్నా.

సడన్‌గా నా దగ్గర ఎక్కువ డబ్బులు లేవని గుర్తొచ్చింది. ఎలా బిల్ పే చేయటం... ప్చ్... అతని దగ్గర వున్నాయో లేవో... అతనికి చెప్పేస్తే... బిల్ రానీ చెప్పొచ్చు.

సాయంకాలం ఆరవుతోంటే తాగటం తినటం పూర్తి చేసి బిల్ తెమ్మన్నాడు.

'నే పే చేయటంలేదు. అన్ని డబ్బులు నా దగ్గర లేవ్,' అని రిహార్సెల్స్ వేశాను కానీ చెప్పలేకపోయా.

అతను క్రెడిట్ కార్డులో పే చేసాడు.

"ఏం చేస్తుంటావ్," అడిగా.

"అంటే..."

"చదువు... జాబ్... బిజినెస్..."

"చెప్పుకో."

"చెప్పలేను."

"స్టూడెంట్."

"ఏం చదువుతున్నావ్."

"డిగ్రీ ఫైనల్ యియర్."

"వో..."

అతను కారుని డ్రైవ్ చేస్తూ, "రెయిన్‌డాన్స్‌కి వెళదామా," అడిగాడు.

"యిప్పుడా... నో... యింటికి వెళ్లిపోవాలి."

"రేపు."

"సాయంకాలం కష్టం యింట్లో పంపించరు."

"ఎందుకు. అందులో రాంగ్ ఏముంది," ఆశ్చర్యంగా అడిగాడు.

"మీరంతా యింట్లో చెప్పే వెళతారా."

"నే బాయ్ఁని కదా... ఏం అడగరు," అన్నాడు.

"దీపాలి?"

"తెలియదు. చెపుతుందో లేదో. అయినా అదే మంత పెద్ద విషయం. మేనేజ్ చెయి," అన్నాడు.

"థ్యాంక్స్" కారు దిగుతూ అన్నాను.

అతను చిరునవ్వుతో కుడిచేయి చాచాడు. నేనూ కుడిచేయి చాపాను. ఇంటికెళ్లిన కాసేపటికి నిద్ర వస్తుంటే పడుకున్నా. తరువాత రోజు ఇంట్లో ఫ్రెండ్ పుట్టినరోజు పార్టీ అని చెప్పాను. అమ్మ వెళ్లమంది. జాగ్రత్తగా రమ్మంది. కాలేజ్‌కి వెళుతుంటే చిన్ని గిఫ్ట్ ప్యాకెట్ యిచ్చింది.

"ఏంటిది."

"పుట్టినరోజు అన్నావ్ కదా. చిన్ని గిఫ్ట్. పుస్తకం," అంది.

"చదవరేమో','లోపలెక్కడో చివుక్కుమంటుంది. అమ్మతో ఇలా లేనిపోని ప్రోగ్రామ్ చెప్పినందుకు. మానేస్తే ఆ... వొక్కసారే కదా ఎలా ఉంటుందో చూస్తే సరి. యింకెప్పుడూ యిలా చెప్పను. సారీ... మనసులోనే అనుకున్నా.

"మనం ఇవ్వాలనుకున్నది ఇవ్వాలి. మంచి పుస్తకం. పొరపాటున చదివి నచ్చితే మంచిదే కదా..." అంది అమ్మ. ఎక్కువసేపు అమ్మ దగ్గర నిలబడలేక ఆ గిఫ్ట్ అందుకుని త్వరత్వరగా కాలేజ్‌కి వెళ్లిపోయాను.

యీ లూజ్ షర్ట్‌లో వెళితే బాగుండదేమో ఆలోచించా. కానీ యిప్పుడు స్కిన్ టైట్ టాప్‌నెలా సంపాదించటం. సరే యిలాగే వెళతా.

సాయంకాలం ఏడువుతోంటే డాన్స్ దగ్గరికి తీసు కెళ్లాడు ప్రదీప్. ఆర్టిఫిషియల్ వానలో అమ్మాయిలు, అబ్బాయిలు వుషారుగా డాన్స్ చేస్తున్నారు. బోల్డంత బెరుగ్గా తటపటాయింపుగా అనిపించింది. అలా చేయ లేననిపించింది. ప్రదీప్ ఎంకరేజ్ చేశాడు. ప్రదీప్ రెండు చేతులు నా నడుం మీద వేసి నా ప్రమేయం లేకుండానే డాన్స్ చేస్తూ నాతోనూ చేయించేస్తున్నాడనిపించింది.

ఆ రాత్రి పదవుతోంటే తడిసిపోయిన నేను యింటికి ఎలా వెళ్లటమాని కంగారుపడుతోంటే, "అం ఏదో వొకటి చెప్పు," అన్నాడు ప్రదీప్.

అంత ఆలశ్యంగా తడిసిపోయి యింటికొచ్చిన నన్ను చూసి అమ్మ కంగారుపడుతూ, "తడిసిపోయా వేంటి," అంది.

"వచ్చే ముందు బాత్‌రూంలోకి వెళ్లా. తెలియక షవర్ విప్పా. వెంటనే క్లోజ్ చేయడం రాలే. బట్టలు మార్చుకొని వెళ్లమంది. కానీ ఆలశ్యం అయిపోతోందని వచ్చేశా," అన్నాను.

"మనింట్లో షవరుంటే యిలా అవ్వదు కదా," అన్నాడు తమ్ముడు.

"నీ దగ్గర ఆ ఇంటి నెంబర్ తీసుకోలేదు ఉదయం. చాలా కంగారుపడ్డా," అంది అమ్మ.

"అందుకే సెల్ వుండాలి." అన్నాను.

సెల్ లేకపోతే తనది మిడిల్‌క్లాస్ అనుకుం టారా... అలాక్కూడా అనుకోరేమో. మిడిల్‌క్లాస్ పూర్ అంతా సెల్ వాడుతున్నారు కదా. తను అంతకంటే పూర్... బిలో పావర్టిలైన్ అనుకొంటారేమో. అసలు తననెన్ని ఎస్.ఎమ్.ఎస్.లు మిస్ అవుతుందో... నో తనకి కచ్చితంగా సెల్ కావాలి. యిదే అదను అడగాలి.

"సెల్ కావాలి," తిరిగి అడిగాను.

"కొందాం," అన్నారు నాన్నగారు.

"సెల్ ఎందుకు," అడిగింది అమ్మ.

"మాట్లాడుకోడానికి," అన్నారు నాన్నగారు.

"నో సెల్ ఫోన్," స్పష్టంగా చెప్పేసింది అమ్మ.

''పోనీలే... తను యిష్టపడుతోంది కదా. అందరి దగ్గరా వుండి తన దగ్గర లేకపోతే చిన్నతనంగా వుంటుంది కదా,'' అన్నారు నాన్నగారు.

''ప్రకాష్... కాలేజీలో చదువుకునే పిల్లలకి సెల్ ఫోన్స్ అవసరం ఏముందో చెప్పు,'' అడిగింది అమ్మ.

''యీజీ క్విక్ కమ్యూనికేషన్.''

''ఎవరితో.''

''ఫ్రెండ్స్‌తో, పేరంట్స్‌తో, బంధువులతో.''

''నువ్వు ఎవరితో కమ్యునికేట్ చెయ్యాలి,'' అడిగింది అమ్మ.

''అబ్బా! అందరి దగ్గరా వుంది. నాక్కావాలి,'' అసహనంగా అన్నాను.

''సెల్‌ఫోన్ వాడే అవసరం, సమయం నీకింకా ముందు ముందు వస్తుంది. అప్పుడు కొనుక్కో. ఇప్పుడు మాత్రం వద్దు,'' అంది అమ్మ.

''ఏంటీ అదేమన్నా మిస్‌యూజ్ చేస్తుందనా,'' నవ్వుతూ అడిగారు నాన్నగారు.

''ప్రపంచంలో మీకు తెల్సింది ఆ వొక్క మిస్ యూజ్ మాత్రమేనేమో... అనవసర విషయాలని ప్రమోట్ చేయటం కూడా అంతే. నో సెల్‌ఫోన్,'' నిక్కచ్చిగా చెప్పేసింది అమ్మ.

సో... యిప్పట్లో సెల్‌ఫోన్ రాదన్నమాట.

ఆ రెయిన్‌డాన్స్‌కి వెళ్లటం ఎప్పుడు చూడని వో కొత్త వాతావరణం చూసినట్టు అనిపించింది. కానీ, యీ యింట్లో అమ్మ కంగారుచూసి 'ఎందుకొచ్చినవివన్నీ' అనిపించింది. ఆరోజు అలా బీర్ రుచి చూడటం ఈ రెయిన్‌డాన్స్‌కి వెళ్లటంతోనే యింట్లో చెప్పే పొంతనలేని, కలిపించే మాటలు ఆగిపోలేదు.

వోసారి డిస్కో... మరోసారి ఫామ్‌హౌస్ పార్టీ, మరోసారి వీకెండ్ పార్టీ ఏదో ఒక పబ్‌కి ఇలా సాగుతూనే ఉంది. ప్రదీప్ సిటిలో ఉన్న పబ్స్‌కి, పార్క్‌లకి స్టార్ హోటల్స్, రెస్టారెంట్స్‌కి, డాబాలకి, డాన్స్ పార్లర్స్‌కి తిప్పు తూనే ఉన్నాడు. అనేక రంగాలలోని వాళ్ల పిల్లలూ, రక రకాల భాషలవాళ్లూ అంతా పరిచయం అవుతున్నారు. బాగా పరపతున్న వాళ్లు, డబ్బున్నవాళ్లు, ప్రముఖుల పిల్లలతో సమానస్థాయిలో హోటల్స్‌లో బఫేకి వెళ్లటం డాన్స్ చేయటం కారులో తిరగటం అంతా భలే గమ్మత్తు గా అనిపించేది. నా స్థాయి పెరిగిన యిగో సాటిస్‌ఫేక్షన్.

ఇంట్లో నిజం చెపితే పంపించరు అందుకే అవీ యివీ చెపుతున్నానని నాకు నేను నచ్చజెప్పుకునేదాన్ని. కానీ లోపలెక్కడో చిన్న బెంగ ఉండేది, నాపై బోల్డంత నమ్మకం పెట్టుకున్న అమ్మకి ఇవన్నీ తెలిస్తే ఏం అను కుంటుందని. చదువుపై, పుస్తకాలపై తగ్గుతున్న శ్రద్ధ. ప్రదీప్‌తో మాట్లాడటానికి వీలుగా సినిమా పత్రికల్లోని గాసిప్ చదవటం, వస్తున్న సినిమాలు వాళ్ల జీవితాలు, పాటల ఆల్బమ్స్, వీలైనంతగా బరువు పెరక్కుండా చూసుకోవటం... ఇంట్లోవాళ్లకి అనుమానం రాకుండా ఎలాగో చూసుకోవటం... అవకాశం దొరికితే గంటలు గంటలు అతనితో ఫోన్‌లో కబుర్లు చెప్పటం... మానసి కంగా అస్సలు ఖాళీ లేకపోవటం. కారు, సెల్, చాలా అందమైన బట్టలు లేవనే చింత.

ఎగ్జామ్స్ అయిపోయాయి. అరాకొరా మార్కు లతో పాస్ అయ్యాను. అమ్మ షాక్ అయింది.

''బాగా రాసానన్నావ్,'' మెల్లగా అంది.

మౌనంగా ఉండిపోయా.

అమ్మ సతాయించలేదు. కానీ ఆలోచనలో పడింది. డిగ్రీలో జాయిన్ అయిన నెలకి వోరోజు మధ్యాహ్నం ప్రదీప్ ఓ చిన్ని తోటున్న ప్రదేశానికి తీసుకు వెళ్లాడు. లోపల ఓ యిల్లుంది. అతని వెంట లోపలికి వెళ్లాను. గదిలోకి వెళ్లాడు వో డబుల్ కాట్, టి.వి., చిన్న ఫ్రిజ్... ఏ.సి.

''ఏంటిది.''

''గెస్ట్‌హౌస్.''

అతనీ ఆరునెలల కాలంలో ఎప్పుడూ ఇలా ఒంటరి ప్రదేశాలకి తీసుకురాలేదు. భయం వేసింది.

అప్పటికే తాగున్న అతను మరో బాటిల్ వోపెన్ చేశాడు. మంచంపై వెనక్కి జరిగి కూర్చుంటూ చెయ్యి చాపాడు.

భయం పెరిగింది. చప్పున తలుపు తీసుకొని గదిలోంచి బయటికి వచ్చేశాను. రోడ్డు మీదకొచ్చి ఆటో ఎక్కేశాను. అంత మెరుపువేగం నాకుందని అప్పుడే తెలిసింది.

ఆ రాత్రి ఉండలేక ప్రదీప్‌కి కాల్ చేశాను.

''పారిపోయావ్,'' కూల్‌గా అన్నాడు.

''భయం వేసింది.''

''మొదట్లో అలానే అన్నీ భయం వేస్తాయ్. రేపు వెళదామా?''

''అలాంటివి ఇష్టంలేదు ప్రదీప్. పెళ్లి అయ్యాక.''

''పెళ్లా... మహీ నువ్వు లేనిపోనివేవో ఊహించు కుంటున్నావేమో... క్లియర్ చేస్తున్నా. ఇదంతా జస్ట్ ఫన్. అంతే. పెళ్లి... నో... అలాంటిదేంలేదు,'' అన్నాడు.

''మరి మరి ఇన్నాళ్లు... నువ్వు నేను ఈ స్నేహం! గర్ల్‌ఫ్రెండ్ అన్నావ్. వాలెంటైన్స్ డే రోజు గిఫ్ట్ యిచ్చావ్,'' గొంతు తడి ఆరిపోతోంటే మాటలు ఆగిపోయాయి.

''వో మహీ... యిదంతా జస్ట్ ఫర్ ఫన్... పెళ్లి అదంతా మా ఇంట్లోవాళ్ల యిష్టం. పేరెంట్స్‌ని కష్ట

పెట్టడం ఎందుకు చెప్పు. అరే ఇంత బాక్‌వర్డ్ ఆలోచనలున్నాయని తెలీదు. అప్పుడే చెప్పేవాడిని. నువ్వూ ఎప్పుడూ అడగనూ లేదు. అయినా చూడు ఇలా రోజూ తిరిగేవాళ్లంతా పెళ్లిళ్లు చేసుకుంటారనుకుంటున్నావా... ఎక్కడివక్కడే మర్చిపోవాలి. ఫన్ దారి ఫన్‌ది. చదువు దారి చదువుది. ఆ తర్వాత కెరీర్... పెళ్లి పిల్లలు... ఇంత బాక్‌వర్డ్‌గా ఉండకు. మోడ్రన్‌గా ఉండు,” అతను చెపుతూనే ఉన్నాడు. ఫోన్ పెట్టేశాను.

అసహ్యం వేసింది నాపై నాకే.

ఆ అసహ్యం రోజురోజుకీ ఎక్కువవుతోంది. కాలేజీకి వెళ్లటం, ఇంటికి వచ్చి అలా మంచంపై వాలిపోవడం, ముభావంగా మారిపోయా. ఇంటర్మీడియెట్‌లో మంచి మార్కులు వచ్చి ఉంటే మంచి కాలేజీలో అడ్మిషన్ వచ్చి ఉండేది. నా జీవితమంతా ఆ మార్కుల షీట్ వెక్కిరిస్తోనే ఉంటుంది.

ఇలా యెందుకు జరిగింది.

నాపై నాకు కలిగిన అసహ్యం రోజురోజుకీ పెరిగిపోతూనే ఉంది. నాలో తేడా అమ్మ గమనించింది.

“నీకెలా తెలుసు ఏదో జరిగిందని,” అడిగా అమ్మని.

“నీలోని ఆర్టిఫిషియల్ ఆనందాల్ని నే పట్టుకోలేకపోయా. కానీ నీ నిజమైన దిగుల్ని గుర్తుపట్టా,” అంది అమ్మ.

బయట వర్షపు చప్పుడులా అమ్మ మాటలు మృదువైన పాటలా వినిపిస్తున్నాయి.

చెప్పేశాను. పూర్తిగా చెప్పేశాను.

“లోపలెక్కడో చివుక్కుమంటున్న క్యూరియాసిటి డామినేట్ చేసింది. అసహ్యంగా వుంది,” అన్నాను.

“వర్షంలో కాసేపు తడుద్దాం వస్తావా” అడిగింది అమ్మ.

చిన్నగా నవ్వాను. ఇంతకు ముందైతే ఇప్పటిదాకా ఆగేదాన్నా. ముందుగా వర్షంలో పరిగెత్తేదాన్ని. “ఇప్పుడా మూడ్ లేదు,” అన్నాను.

నాకు ఊహ తెల్సినప్పట్నుంచీ వర్షం వచ్చిందంటే మైమరచి ఆ వర్షాని అమ్మ సెలబ్రేట్ చేయటం బాగా గుర్తు. ఒక అద్భుతంతో ఆడుకుంటున్నట్టు అమ్మ నాతో తమ్ముడితో వర్షంలో ఆడుకునేది. తడిసి తడిసి ఇంట్లో కొచ్చి పొడిబట్టల్లోకి మారి వేడివేడిగా ఏమైనా చేసి పెట్టేది.

“రా,” అంది.

“రాలేను,” అన్నాను.

అమ్మ నవ్విన నవ్వు ఆ చీకటిలో మెత్తగా సోకింది. “యిదంతా అసహ్యం వల్లనే,” అడిగింది.

“నాకేం బాలేదు.”

“మహీ మన చుట్టూ చాలా వచ్చి పడుతుంటాయి. ఉక్కిరిబిక్కిరి చేస్తుంటాయి. ఎంచుకొనే ఛాయిస్ మనకుండాలి. అయితే అదేమంత తేలికైన విషయం కాదు. బాగా అనుభవజ్ఞులే కొట్టుకు పోతుంటారు. వస్తువులు డబ్బు పవర్ పేరు ఫన్ ఏమైనా కావొచ్చు. ది బెస్ట్ అనే వాటికి పరిచయం చేస్తూనే వున్నాను. కానీ నీ చుట్టూ ఉన్నది నా ఒక్క ప్రపంచమే కాదు. అనేకానేక ప్రపంచాలున్నాయి. వాటి ప్రభావం నీపై వుంటుంది. ఈవొక్క అనుభవంతోనే జీవితం అయిపోదు. ఆగిపోదు. నీకెలా చెప్పాలో తెలియదు. యెక్కడ నుంచి చెప్పాలో తెలియదు. చిన్నపిల్లవి. వొక్కటి మాత్రం చెప్పగలను. నీ బాధ బాధగా నాకు తెలుస్తుంది. నీ బాధని తీసుకొని పంచుకొనే మనుష్యులున్నప్పుడు ప్రపంచం చాలా ఉంటుంది. ఈ బాధ చివర ఏ కాంతీ లేదని మాత్రం అనుకోకు.” అమ్మ మాటలు వానజల్లు ముఖంపై చిలకరిస్తోన్నంత చల్లగా మృదువుగా నాలోకి ఇంకుతున్నాయి.

“కొన్నిసార్లు గాయపడటం అనివార్యం. అవసరం. ఒక కొత్త జీవితం అందులోంచే చిగురిస్తుంది. ఆ నమ్మకం నాకు ఉంది,” అంటూ అమ్మ తలుపులు తెరిచింది.

వర్షపు శబ్దం తప్పితే ఏమీ వినిపించలేదు. ప్రపంచం సర్వమూ వర్షపు ధ్వనులతో నిండిపోయినట్టుగా ఆకాశంలోంచి యేవో రాలిపడుతూ సవ్వడులు చేస్తూ వాటితో కలగలిసి మధ్యమధ్యలో అస్పష్టంగా రోడ్డువారగా వర్షపునీరు పారుతోన్న ధ్వని... ఇందాక అద్భుతంగా అనిపించని ధ్వని మెల్లమెల్లగా తిరిగి కాస్త కాస్తగా అద్భుతంగా అనిపిస్తోంది.

ఆంధ్రప్రభ ఆదివారం సంచిక, 23 ఫిబ్రవరి 2003